సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 4 । జూలై । 2024



ఉల్లి ధరలు పైపైకి..

సీజన్ ముగిసి దిగుబడులు తగ్గడంతో ఉల్లి ధరలు భారీగా పెరుగుతున్నాయి.

వివరాలు 8లో ▸



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /24.5

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మండల ప్రజా పరిషత్ పాలక మండలి, ఎంపీటీసీల పదవీకాలం బుధవారంతో ముగిసింది. అయితే ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగక పోవడంతో మండల పరిషత్‌లు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లాయి. ఈ మేరకు కలెక్టర్ విజయేందిర ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో అడ్డాకుల ప్రత్యేకాధికారిగా డీఎఫ్‌ఓ సత్యనారాయణ, బాలానగర్‌కు పరిశ్రమల శాఖ జీఎం బాబురావు, భూత్పూర్‌కు హార్టికల్చర్ అధికారి వేణుగోపాల్, చిన్నచింతకుంటకు డీవైఎస్‌ఓ శ్రీనివాస్, దేవరకద్రకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, గండేడ్‌కు ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ డీడీ పాండు, హన్వాడకు డీఆర్‌డీఓ నర్సింహులు, జడ్చర్లకు ఆర్డీఓ నవీన్, కోయిలకొండకు జిల్లా వెటర్నరీ అధికారి మధుసూదన్‌గౌడ్, మహబూబ్‌నగర్‌కు సీపీఓ దశరత్, మూసాపేటకు జిల్లా మత్స్య శాఖ అధికారి రాధా రోహిణి, నవాబ్‌పేటకు డీసీఓ పద్మ, రాజాపూర్‌కు బీసీ సంక్షేమాధికారి ఇందిరకు బాధ్యతలు అప్పగించారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తుందని రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. మహబూబ్‌నగర్ డిపో నుంచి నాన్‌స్టాప్ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల లక్కీడిప్ డ్రాను బుధవారం బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ లక్కీడిప్ డ్రాలో సంపత్, లిఖిత్, డి.రాజు గెలుపొందారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అన్నారు. నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించేవారు తమ ప్రయాణం తర్వాత టికెట్ వెనక వైపు పేరు, ఫోన్ నంబర్ రాసి బాక్స్‌లో వేయాలని కోరారు. ప్రతినెలా మొదటి వారంలో లక్కీడ్రా నిర్వహించి ముగ్గురికి బహుమతులు అందజేస్తామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీదుర్గ, డిపో మేనేజర్ సుజాత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

జడ్చర్ల/ రాజాపూర్: జిల్లా ఎస్పీ జానకి బుధవారం జడ్చర్ల, రాజాపూర్ పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్లలోని పరిసరాలను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు, పోలేపల్లి సెజ్ తదితర వివరాలపై ఆరా తీశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడి పరిశ్రమలలో ఉపాధి నిమిత్తం వస్తారని పోలీస్ అధికారులు ఎస్పీకి వివరించారు. సైబర్ క్రైం కేసులు కూడా నమోదవుతున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సత్వరమే సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పక్కా భవనం కోసం స్థలం ఎక్కడైనా కేటాయించారా అనిఅడగగా.. ముదిరెడ్డిపల్లి శివారులో ఎకరా స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారని ఎస్‌ఐ రవి చెప్పారు. ఆమె వెంట సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు చంద్రమోహన్, అశోక్‌బాబు, శివానందంగౌడ్, సిబ్బంది ఉన్నారు.

7న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభమయ్యే టూడేస్ లీగ్ పోటీల్లో పాల్గొనే మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలను ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పిల్లలమర్రి సమీపంలోని మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు రెండు ఫొటోలు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతోపాటు వైట్ డ్రెస్, వైట్ షూస్‌తో హాజరుకావాలని సూచించారు.

మూడు రోజుల్లో 8 లక్షల మొక్కలు

పాలమూరు: వన మహోత్సవం కింద ఈ ఏడాది జిల్లాకు 55 లక్షల మొక్కలు లక్ష్యం కేటాయించారు. ఇందులో భాగంగా మూడు రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 8 లక్షల మొక్కలు నాటారు. ప్రధానంగా డీఆర్‌డీఏ శాఖ నుంచి దాదాపు 6 లక్షల మొక్కలు, మిగిలిన ప్రభుత్వ శాఖలు కలిపి మరో 2 లక్షల మొక్కలు నాటారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం ఆగస్టు మొదటి వారం వరకు కొనసాగనుంది. ప్రతి శాఖ ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయడానికి ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎన్నాళ్లిలా..!

త్రైపాక్షిక ఒప్పందం హుళక్కే..

- గ్రీన్ ట్రిబ్యునల్, హెచ్‌ఆర్సీ ఆదేశాలు బేఖాతరు
- యథేచ్ఛగా సాగుతున్న సీడ్ ఆర్గనైజర్ల దందా
- దుర్భరంగా విత్తన పత్తి రైతుల బతుకులు
- ఏటేటా తప్పని తంటాలు.. నకిలీ సీడ్‌కు పడని అడ్డుకట్ట
- 'అధికార' యంత్రాంగం తీరుపై విమర్శలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గుజరాత్ తర్వాత దక్షిణ భారతదేశంలో నాణ్యమైన సీడ్ పత్తి నడిగడ్డలోనే సాగవుతోంది. ప్రధానంగా ఉమ్మడి పాలమూరులోని జోగుళాంబ గద్వాల జిల్లాలో సుమారు 45 వేల ఎకరాల్లో రైతులు విత్తన పత్తి సాగు చేస్తున్నారు. ఇక్కడ ఏటా సుమారు రూ.2 వేల కోట్ల లావాదేవీలు జరుగుతాయనేది అంచనా. అయితే ముఠాగా ఏర్పడిన పలువురు ఆర్గనైజర్లు తమకున్న ఆర్థిక, రాజకీయ అండతో ఎలాంటి పెట్టుబడులు లేకుండా దందా కొనసాగిస్తూ.. దోపిడీ పర్వానికి తెరలేపారు. కంపెనీలు, విత్తన పత్తి సాగుదారులకు మధ్యవర్తిత్వం పేరిట రైతులను నిలువునా మోసం చేస్తూ అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తారు. రైతులు అన్యాయానికి గురవుతుండగా రైతు సంఘాలు ఆందోళనలు చేపట్టడంతోపాటు సీడ్ ఆర్గనైజర్ల అక్రమాలను తెరపైకి తీసుకొచ్చాయి. సీడ్ కంపెనీలు ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా రైతులతో చట్టబద్ధమైన ఒప్పందం చేసుకోవాలని, నిర్దిష్టమైన విత్తన ధర ప్రకటించాలని, ఫెయిల్ అయిన విత్తనాలను అధికారుల సమక్షంలోనే రైతులకు ఇవ్వాలని తదితర డిమాండ్లతో దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాయి. అయినా ఫలితం లేకుండా పోయింది. పాలకుల నిర్లక్ష్యం, పట్టించుకోని అధికార యంత్రాంగం వెరసి రైతులు, సీడ్ ఆర్గనైజర్లు, కంపెనీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం సుమారు ఎనిమిదేళ్లుగా అటకెక్కగా.. విత్తన పత్తి సాగు చేస్తున్న రైతులకు న్యాయం అందని ద్రాక్షగా మారింది.

గద్వాల జిల్లాలో రెండేళ్ల క్రితం 200 మంది వరకు సీడ్ ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు ఉండేవారు. ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా కంపెనీలు, రైతులకు మధ్యవర్తిగా వ్యవహారం నడుపుతూ అప్పనంగా సంపాదించుకునే అవకాశం ఉండడంతో రెండేళ్లలో ఈ సంఖ్య 400 మంది వరకు పెరిగింది. ఇందులో మొదటి నుంచీ సీడ్ ఆర్గనైజర్లుగా ఉన్న వారి కనుసన్నల్లోనే విత్తన దందా మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతోంది. వారికి సంబంధించిన బంధు మిత్రులు, అనుచరులే ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లుగా చెలామణి అవుతున్నారు. వీరు మాఫియాగా ఏర్పడి కోట్లకు పరిగెడుతూ ఆర్థిక సామ్రాజ్యాన్ని విస్తరించి వ్యవస్థనే శాసించే స్థాయికి ఎదిగారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారని నడిగడ్డ రైతుల హక్కుల పోరాట సమితితో పాటు తదితర రైతు సంఘాలు చాలా ఏళ్లుగా ఆందోళనలు చేపట్టాయి. గతంలో పలువురు గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించారు.

సమావేశాలకే పరిమితం..

ఈ క్రమంలో జిల్లా అధికారులు రైతు సంఘాలు, సీడ్ ఆర్గనైజర్లు, కంపెనీల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఓ వైపు విత్తనాలు సక్రమంగానే ఉన్నా ఫెయిల్ అయ్యాయంటూ విత్తన పత్తి సాగుదారులను ఆర్గనైజర్లు మోసం చేస్తున్నారని.. మరోవైపు విఫల, నకిలీ విత్తనాలతో రైతులను అప్పులపాలు చేస్తూ వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారని.. దీనిపై జోక్యం చేసుకోవాలని నడిగడ్డ రైతుల హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ సుమారు నాలుగున్నరేళ్ల క్రితం మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయించారు. స్పందించిన హెచ్‌ఆర్సీ వెంటనే పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరింది. 2020 మే నెలలో సీడ్ పత్తి కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, నడిగడ్డ రైతు హక్కుల పోరాట సమితి ప్రతినిధులతో అప్పటి అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంటామని కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లు హామీ ఇచ్చారు. కానీ.. అది మాటల వరకే పరిమితమైంది. ఇప్పటివరకూ ఆర్గనైజర్ల దోపిడీ నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది.

ఒప్పందం అమలు చేయాలి..

ఆర్గనైజర్ల చేతిలోమోసపోతున్న సీడ్ పత్తి రైతులను ఆదుకోవాలి. రైతుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో విత్తన పత్తి సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. దీనిపై నడిగడ్డలో దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ల సమక్షంలో జరిగిన ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడంతో పాటు వెంటనే అమలు చేయాలని హెచ్‌ఆర్సీని ఆశ్రయించాం. అక్రమ డబ్బు సంపాదనకు అడ్డుకట్టపడుతుందని కంపెనీలు, ఆర్గనైజర్లు ఒప్పుకోవడం లేదు. చట్టబద్ధత ఒప్పందం కొనసాగితే రైతులకు మేలుతో పాటు నకిలీ విత్తనాల వ్యాపారానికి పూర్తిగా అడ్డుకట్టపడుతుంది. కలెక్టర్ దృష్టి సారించి సీడ్ పత్తి సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలి.

– రంజిత్‌కుమార్,
నడిగడ్డ రైతుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, గద్వాల

కంపెనీల నుంచే నేరుగా విత్తనాలు అందించాలి..



మా కుటుంబానికి సీడ్ పత్తి పంటే ప్రధాన జీవనాధారం. నాకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో ఎకరా సీడ్ పత్తి సాగు చేశా. గత ఏడాది సీడ్ ఆర్గనైజర్ చేతిలో మోసపోయినా. విత్తనాలు సరిగ్గా ఉన్నా.. ఫెయిల్ అయ్యామంటూ బురిడీ కొట్టించాడు. విధి లేని పరిస్థితిలో మరో ఆర్గనైజర్ వద్ద సీడ్ పత్తి విత్తనాలు తీసుకుని పంట సాగు చేశా. ఆర్గనైజర్ల చేతిలో మోసపోవడం ఏటా నిత్యకృత్యమైంది. నాలాంటి రైతులు ఎందరో ఇప్పటికే మోసపోయి అప్పుల పాలయ్యారు. సీడ్ పత్తి విత్తనాలను రైతులకు నేరుగా కంపెనీల నుంచే అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తిమ్మప్ప, సీడ్ పత్తి సాగుదారుడు, మల్దకల్

హెచ్‌ఆర్సీ ఆదేశాలు బేఖాతరేనా?

రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ శాఖ అధికారులతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంటామని ఆర్గనైజర్లు, కంపెనీల ప్రతినిధులు హామీ ఇవ్వగా.. మినిట్స్ బుక్‌లో కూడా పొందుపర్చారు. అయితే అమలుకు నోచుకోని క్రమంలో నడిగడ్డ రైతుల హక్కుల పోరాట సమితి 2021లో మెమోండం ఆఫ్ అగ్రిమెంట్(ఎంఓయూ) అమలు చేయాలని కోరుతూ మళ్లీ హెచ్‌ఆర్సీని ఆశ్రయించింది. దీంతో గతంలో నిర్వహించిన సమావేశంలో ఒప్పుకున్న అంశాలు ఎందుకు అమలు చేయడం లేదని.. దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలని అధికార యంత్రాంగానికి మానవహక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. కానీ.. దీనిపై అధికారులెవరూ స్పందించడం లేదు.

ఐదేళ్లలో వచ్చిన నిధులు..
రూ.23.01 కోట్లే!



జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులతో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి (ఫైల్)

నేటితో ముగియనున్న జెడ్పీటీసీల పదవీకాలం

- నిధుల లేమితో కొట్టుమిట్టాడిన 11వ పాలక మండలి
- ఇకపై కలెక్టర్ చేతుల్లోకి జిల్లా పరిషత్
- నేడు జెడ్పీ మీటింగ్ హాల్‌లో సభ్యులకు వీడ్కోలు సభ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ 11వ పాలక మండలి పదవీ కాలం గురువారంతో ముగుస్తుంది. అయితే ఈ పాలక మండలి మొత్తం నిధుల లేమితో కొట్టుమిట్టాడిందనే చెప్పాలి. ప్రస్తుత పాలక మండలి 2019 జూలై 5న కొలువుదీరగా.. ఈ ఐదేళ్లలో మంజూరు చేసిన నిధులు రూ.23.01 కోట్లు మాత్రమే. పదవీకాలంలో మొత్తంగా 17 సర్వసభ్య సమావేశాలు జరిగాయి. జిల్లాలో 14 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా.. ఇటీవల మరో రెండు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. అయినప్పటికీ 14 జెడ్పీటీసీ స్థానాలు మాత్రమే పరిగణలోకి వస్తాయి. అయితే ఏకపక్షంగా 14 స్థానాలను అప్పటి టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పార్టీ గెలుచుకోగా.. జెడ్పీ చైర్‌పర్సన్‌గా స్వర్ణసుధాకర్‌రెడ్డి ఎంపికయ్యారు.

1959లో జిల్లా పరిషత్ ఏర్పాటు..

మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ 1959వ సంవత్సరంలో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి దాక 11 మంది జిల్లా పరిషత్ చైర్మన్లుగా వ్యవహరించారు. జిల్లా పరిషత్ ఏర్పడిన తర్వాత తొలి జెడ్పీ చైర్మన్‌గా కె.రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. ఈయన తర్వాత వరుసగా రెండు సార్లు కేకే రెడ్డి, నారాయణగౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్రావ్, సీతాదయాకర్‌రెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, బండారి భాస్కర్ చైర్మన్లుగా వ్యవహరించారు. ప్రస్తుతం 11వ చైర్‌పర్సన్‌గా స్వర్ణసుధాకర్‌రెడ్డి కొనసాగుతుండగా గురువారంతో ఈమె పదవీకాలం ముగుస్తుంది. వెంకటయ్య వరకు జిల్లా పరిషత్‌కు జిల్లా మొత్తం ఓట్లు వేసి ఎన్నిక జరిగింది. వెంకట్రావ్ నుంచి జెడ్పీటీసీ వ్యవస్థ వచ్చింది. అప్పటి నుంచి జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ చైర్మన్‌ను పరోక్ష పద్ధతిలో ఎన్నుకున్నారు. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పదవీకాలం పూర్తయిన తర్వాత 2011 జూలై 23 నుంచి 2012 జూలై 4 వరకు జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారి (కలెక్టర్) పాలనలో కొనసాగింది. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అనంతరం ఎన్నికలు కాకపోవడంతో అప్పటి కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించారు.

నేడు వీడ్కోలు సభ

జెడ్పీ పాలక మండలి సభ్యులకు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితోపాటు 13 మంది జెడ్పీటీసీ సభ్యులు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

ఏయే గ్రాంట్ల కింద నిధులు..

ప్రస్తుత పాలక మండలి కొలువుదీరినప్పటి ఐదేళ్ల వ్యవధిలో కేవలం రూ.23.01 కోట్ల నిధులు మాత్రమే వచ్చాయి. నిధుల కోసం జెడ్పీటీసీ సభ్యులు ఎంత కోరినా ప్రభుత్వం విడుదల చేయలేదు. సాధారణంగా జెడ్పీకి రావాల్సిన నిధులు తప్ప ప్రత్యేకంగా నిధులను మాత్రం కేటాయించలేదని జెడ్పీటీసీ సభ్యులు వాపోయారు. మొత్తంగా 806 రకాల పనులు చేపట్టగా.. వీటికి రూ.23.10 కోట్లు ఖర్చు అయ్యాయి. ఇందులో జనరల్ ఫండ్ కింద రూ.10 కోట్లు విడుదల కాగా ఈ నిధులతో 363 పనులకు రూ.9.26 కోట్లు వెచ్చించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.11 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 235 పనులు చేపట్టి.. రూ.7.11 కోట్లు ఖర్చు చేశారు. స్పెషల్ గ్రాంట్ కింద రూ.3.85 కోట్లు రాగా.. 111 రకాల పనులు చేపట్టారు. వీటికి రూ.3.85 కోట్లు ఖర్చయ్యాయి. ఈ నిధులతోపాటు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.2.95 కోట్లు కేటాయించగా.. 97 రకాల పనులు చేపట్టి.. రూ.2.88 కోట్లు ఖర్చు చేశారు.

సహకారం మరిచిపోలేను..

జిల్లా పరిషత్ పాలక మండలి పదవీకాలం గురువారం ముగుస్తుంది. ఈ ఐదేళ్లలో జెడ్పీటీసీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యేలు అందరి సహకారం మరచిపోలేను. చివర్లో జెడ్పీటీసీలు నాపై వ్యవహరించిన తీరు కొంత బాధ అనిపించినా.. ఈ పదవీకాలం నాకు మంచి అనుభూతిని ఇచ్చింది. దేవుడు ఇచ్చిన శక్తి మేరకు పనిచేశాం.

– స్వర్ణసుధాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్

మరోసారి కలెక్టర్ చేతుల్లోకి..

జిల్లా పరిషత్ పాలక మండలి పదవీకాలం గురువారంతో ముగుస్తుంది. ఎన్నికలు జరగకపోవడంతో గతంలో మాదిరిగానే ఈసారి కూడా జెడ్పీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగనుంది. గతంలో కలెక్టర్లు పురుషోత్తంరెడ్డి, శర్మన్, గిరిజాశంకర్ ప్రత్యేకాధికారులుగా పనిచేసిన చరిత్ర జెడ్పీకి ఉంది. గతంలో మాదిరిగానే శుక్రవారం నుంచి కలెక్టర్ విజయేందిర బోయి జెడ్పీ ప్రత్యేకాధికారిగా వ్యవహరించే అవకాశం కనిపిస్తోంది.

కలెక్టర్ రాక.. సిబ్బంది కేక



జనరల్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

- ఉరుకులు, పరుగుల మీద జనరల్ ఆస్పత్రికి చేరిన వైద్యాధికారులు

పాలమూరు: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ముందుగా క్యాజువాలటీ, ఐసీయూ, పురుషులు, మహిళల శస్త్రచికిత్స వార్డు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్, సెంట్రల్ ల్యాబ్, డీ అడిక్షన్ సెంటర్, గైనిక్ విభాగం పరిశీలించడంతోపాటు వైద్యం కోసం వచ్చిన రోగులతోనూ మాట్లాడారు. ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యులు, ఇతర సిబ్బందిపై మానిటరింగ్ ఎలా కొనసాగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానం ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. డీ అడిక్షన్ సెంటర్‌లోని సైకియాట్రి విభాగంలో ఎలాంటి కేసులు వస్తున్నాయో వైద్యులతో ఆరాతీశారు. గైనిక్‌లో రోజుకు ఎన్ని ప్రసవాలు అవుతున్నాయి.. సాధారణ కాన్పులు, ఆపరేషన్లు, నేరుగా వచ్చే కేసులు, పీహెచ్‌సీల నుంచి ఎన్ని కేసులు రెఫర్ చేస్తున్నారో తెలుసుకున్నారు. ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో ప్రసవాల తర్వాత శ్వాస సమస్యలు, బరువు తక్కువ, నెలలు ముందు జన్మించిన శిశువులకు చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న 450 పడకలు కంటే రోగులు సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని కలెక్టర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్ కోరారు. తనిఖీల్లో గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ రాధ, ఆర్‌ఎంఓలు శిరీష, దుర్గ, ప్రోగ్రాం అధికారి భాస్కర్ నాయక్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమేఘాల మీద..

సాధారణంగా జనరల్ ఆస్పత్రిలో సీనియర్లు అంటూ చెప్పుకొనే కొందరు వైద్యులు, పరిపాలన, నాలుగో తరగతి సిబ్బంది, పరిపాలన విభాగంలో కొందరు అధికారులు మధ్యాహ్నం 12 గంటల వరకు విధులకు హాజరుకారు. ముఖ్యంగా జిల్లా ఆస్పత్రిగా ఉన్ననాటి నుంచి పనిచేసే 'ఆ నలుగురు' డ్యూటీ చేసేది తక్కువ.. బయట రోడ్లపై తిరగడం ఎక్కువగా కనిపిస్తోంది. ఇక మరికొందరు ఉదయం వచ్చి బయోమెట్రిక్ వేయడం లేదా రిజిష్టర్‌లో సంతకాలు పెట్టిన తర్వాత బయటకు వెళ్లడం, సొంత పనులు చక్కబెట్టుకోవడం కనిపిస్తుంది. కానీ, బుధవారం ఆస్పత్రికి కలెక్టర్ తనిఖీ చేయడానికి వచ్చిందని తెలియడంతో బయట ఉన్నవారంతా ఆగమేఘాల మీద ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే ఆస్పత్రిలో కొందరిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓపీల్లో పనిచేసే కొందరు వైద్యులు చికిత్స కోసం రోగులు ఎక్కువగా వస్తే వారిపై మండిపడుతుంటారు. స్కానింగ్ సెంటర్‌తోపాటు ఎక్స్‌రే విభాగం, ల్యాబ్‌లలో పనిచేసే వారు సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. వీటన్నింటిపై కలెక్టర్ దృష్టిసారించి ఆస్పత్రిలో పేదలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ తిరగాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి కనీస సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వారితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటి పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పాలమూరు మున్సిపాలిటీని అన్నింటా మొదటి స్థానంలో నిలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలో ఇప్పటికే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ మొదటి దశకు మంజూరైన రూ.260 కోట్లకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయన్నారు. మలిదశ కోసం మరో రూ.603 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి

ప్రజలకు కలిగే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు 24 గంటలూ పనిచేసే కాల్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే యెన్నం ఆదేశించారు. ఇక వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటించాలన్నారు. ఇలా ప్రతి వార్డులో కనీసం వెయ్యి మొక్కలు పెంచేలా చూడాలన్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఎంఈ బస్వరాజ్, డిప్యూటీ ఈఈలు బెంజిమన్, యూనుస్, ఏఈలు సాయిరాం, హరికృష్ణ, వైష్ణవి, ఏసీపీ జోత్స్నాదేవి, టీపీఓ లక్ష్మీపతి, టీపీఎస్ లక్ష్మీప్రియ, ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా పాల్గొన్నారు.

'అబద్ధపు హామీలు నమ్మి ప్రజలు ఓట్లేశారు'



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రజలు ఆ పొరపాటును ఇప్పుడు గుర్తించారన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు పదవీకాలం పూర్తి చేసుకుంటున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు చేయడం సాధ్యం కాదన్నారు. పంటలు వేసుకుంటున్న రైతులు ఒకదిక్కు కరెంట్ లేక.. చెరువులు, కుంటలు ఎండిపోయి సాగునీళ్ల లేక అష్టకష్టాలు పడుతున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. పార్టీకి అండగా ఉన్న నాయకులు, కార్యకర్తలకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. చేసిన పొరపాట్లను సరి చేసుకుని నాయకులు ముందుకు పోవాలని, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో సమస్యల పరిష్కారానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు కష్టపడి పనిచేశారన్నారు. మహబూబ్‌నగర్‌ను పూర్తిస్థాయిలో శ్రీనివాస్‌గౌడ్ అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ వైస్‌చైర్మన్ వెంకటయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, ఎంపీపీలు సుధాశ్రీ, బాలరాజు, నాయకులు శివరాజు, దేవేందర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, ఆంజనేయులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన గోపాల్‌పేట తహసీల్దార్

- వివరాలు 8లో..

పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో హైడ్రామా

- వివరాలు 10లో..

క్లుప్తంగా

రెండు బైకులు ఢీ: ఒకరు మృతి


నర్సింహ (ఫైల్)

ఆత్మకూర్: ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని జూరాల చెందిన బోయనర్సింహ(37) ఆత్మకూర్‌లోని బీసీకాలనీలో నివాసముంటూ కిరాణషాపులో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో నర్సింహ తన బైక్‌పై బాలకిష్టాపూర్ వెళ్లివస్తుండగా ఆత్మకూర్ చెరువుకట్ట సమీపంలో, ఎదురుగా వస్తున్న దుపల్లి చెందిన జితేందర్ బైకును నర్సింహ ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని అప్పటికే నర్సింహ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య శారదతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి.. మరో యువకుడు


సిద్ధార్థ్ (ఫైల్)

బిజినేపల్లి: రోడ్డుపై అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడి యువకుడ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పాలెం చెందిన సిద్దార్థ్ (19) మంగళవారం మధ్యాహ్నం పని మీద పాలెం నుంచి నాగర్‌కర్నూల్ బైక్‌పై వెళ్తున్నాడు. వెంకటాపూర్ సమీపంలో అకస్మాతుగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వారు వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఇంకా విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బంగారం, నగదు అపహరణ

కల్వకుర్తి టౌన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి నగదు, బంగారం, వెండి ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్ రావు తన కుమార్తెను చూడటానికి ఈ నెల 30న మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తిరిగి వచ్చి చూడగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు క్లూస్‌టీంతో వచ్చి నమూనాలను సేకరించారు. ఈ మేరకు ఇంట్లో బీరువాలో ఉన్న వస్తువులను చిందరవందరగా పడేసి రూ.1.20 లక్షల నగదు, మూడున్నర తులాల బంగారం, ఒక కిలో వెండి వస్తువులు ఎత్తుకెళ్లినట్లుగా ఫిర్యాదు అందిందని ఎస్ఐ వివరించారు. ఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

హాస్టల్ కష్టాలు


కాలినడకన వెళ్తున్న వెన్నాచేడ్ మోడల్ స్కూల్ విద్యార్థులు (ఫైల్)

మోడల్ స్కూళ్లలో వసతి లేక అవస్థలు పడుతున్న విద్యార్థినులు

- ఇతర ప్రాంతాల నుంచి వస్తుండటంతో చదువుపై దృష్టిసారించని వైనం
- ప్రతి పాఠశాలలో వందమంది చేరికకే అవకాశం
- ఈ ఏడాది కూడా పెరగని పరిమితి సౌకర్యం
- ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో దుస్థితి


వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో బాలికల హాస్టల్

గండేడ్: గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన ఆంగ్ల విద్యనందించి విద్యాకుసుమాలు విరబూయించాలన్న సంకల్పంతో ప్రభుత్వం మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేసింది. వాటిలో అన్ని రకాల వసతులు కల్పించి.. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన సాగిస్తోంది. ఇందుకు అనుగుణంగానే ఆశించిన స్థాయిలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. అయితే ఇంటర్ చదివే అమ్మాయిలకు హాస్టల్ కల్పించారు. కానీ, హాస్టల్ వసతి పూర్తిస్థాయిలో లేకపోవడం, అందులోనూ కొంతమంది చేరికకే అవకాశం కల్పించడంతో మిగతా వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా హాస్టల్ వసతి పరిమితి పెంచకపోవడం ఆశనిపాతంగా మారుతుంది. ఫలితంగా మారుమూల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు.. పలు రకాల ఇబ్బందులతో చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు.

బాలికలకు మాత్రమే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. నారాయణపేట జిల్లాలోని గుండుమాల్, ధన్వాడ, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు, వెల్దండ, వనపర్తి జిల్లాలోని కొత్తకోట, ఖిల్లాఘనపూర్, పెబ్బేరు, మహబూబ్‌నగర్ జిల్లాలోని వెన్నాచేడ్‌లలో ఆదర్శ పాఠశాలలు ఉండగా.. వీటిలో 4,908 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 6 నుంచి 10వ తరగతి వరకు 3,486 మంది విద్యార్థులు ఉండగా.. 2,203 మంది బాలురు, 1,283 బాలికలు ఉన్నారు. ఇంటర్‌లో 1,422 మంది విద్యార్థులు ఉండగా.. 365 మంది బాలురు, 1,057 బాలికలు చదువుతున్నారు. కోఎడ్యుకేషన్ ఉన్న ఈ పాఠశాలలో బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంది. అది కూడా ఇంటర్ వాళ్ల కోసం ఏర్పాటు చేసినా.. అందరికీ అవకాశం లేకుండా పోయింది.

వందమందికే పరిమితం..

ఉమ్మడి జిల్లాలోని అన్ని మోడల్ స్కూళ్లలో హాస్టల్ వసతి ఉంది. కానీ, కేవలం 100 మంది మాత్రమే.. అది కూడా ఇంటర్ అమ్మాయిలకు మాత్రమే అవకాశం కల్పించారు. వెన్నాచేడ్ పాఠశాలలో ప్రస్తుతం 624 మంది విద్యార్థులు చదువుకుంటుండగా.. 316 మంది బాలికలు ఉన్నారు. ఉమ్మడి గండేడ్ మండలంలోని గ్రామాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. గతేడాది అతి కష్టమ్మీద 120 మందికి హాస్టల్ అవకాశం కల్పించడంతో మిగతా వారు ఇబ్బందులు పడుతున్నారు.

4 కి.మీ. నడవాల్సిందే..



వెంకట్‌రెడ్డిపల్లి నుంచి గేటు వరకు వెన్నాచేడ్‌లోని మోడల్ స్కూల్ వరకు రోజు 4 కి.మీ., నకడ తప్పడం లేదు. ఉదయం సాయంత్రం బస్సు మిస్సయితే ఇంకో 3 కి.మీ., నడవాలి. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి.. తిరిగి రాత్రి 8 గంటలకు వస్తున్నాం. ప్రస్తుతం పదో తరగతి కావడంతో భయంగా ఉంది. కనీసం పదో తరగతి వారికైనా హాస్టల్ వసతి కల్పించాలి.

– మధుప్రియ, 10వ తరగతి, వెంకట్‌రెడ్డిపల్లి

భయంగా ఉంటుంది..



మా గ్రామం నుంచి బస్సు సౌకర్యం లేదు. కొద్ది దూరం వెళ్లి బస్సు ఎక్కినా నేరుగా వెన్నాచేడ్ వెళ్లదు. దీంతో ఆటోలో వెళ్తున్నాం. ఒక్కోసారి ఆటో కూడా దొరకకోతే నడవాల్సి వస్తుంది. ఈ దారిలో ఆటోలు కూడా బోల్తా పడిన సంఘటనలు ఉండటంతో భయంగా ఉంటుంది. ఇప్పుడు సెకండ్ ఇయర్ చదువుతున్నా. రాకపోకలతోనే చాలా సమయం వృథా అవుతుంది.

– శ్రుతి, సెకండ్ ఇయర్, సోలార్‌నగర్

పరుగో.. పరుగు

మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులు పొద్దున్నే పరుగులు పెట్టాల్సి వస్తుంది. కొన్ని పాఠశాలలు మారుమూల ప్రాంతాల్లో ఉండడంతో ప్రతిరోజు పాఠశాలకు రావడానికి విద్యార్థులు నానాపాట్లు పడుతున్నారు. గండేడ్, మహమ్మదాబాద్ వెల్దండ, ఖిల్లాఘనపూర్ తదితర మండలాల్లోని పీర్లబండ, గోవిందాయిపల్లితండా, పగిడ్యాల్, మంగంపేట్‌తండా, చౌదర్‌పల్లి, మంగంపేట్, కంచన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, సల్కలాపూర్, మామిడిమాడ, వీరయ్యపల్లి, పర్వతాపూర్, ఆగారం, ఆమనగల్, తాడూరు, పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్ తదితర దూర ప్రాంతాల నుంచి ఆయా మోడల్ స్కూళ్లకు విద్యార్థులు వస్తున్నారు.

- జిల్లాలోని చాలాచోట్ల రవాణా సౌకర్యం లేక విద్యార్థులకు కాలినడక తప్పడం లేదు. వెన్నాచేడ్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం రెండుపూటల ఒక బస్సు నడుస్తోంది. ఈ బస్సు మహబూబ్‌నగర్ వస్తుండగా వెంకట్‌రెడ్డిపల్లి గేటు నుంచి గండేడ్‌కు వచ్చే సరికి కిక్కిరిసిపోతోంది. అక్కడి నుంచి గ్రామంలో దిగాక సుమారు కి.మీ., వరకు మళ్లీ కాలినడకన రావాల్సి వస్తుంది.
- ఖిల్లాఘనపూర్ మండలంలోని పర్వతాపూర్ నుంచి వచ్చే విద్యార్థులు 12 కిలోమీటర్ల దూరం నుంచి వస్తారు. 5 కిలోమీటర్లు బస్సులో.. 7 కిలోమీటర్లు ఆటోలో ప్రయాణించాల్సి వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉదయం పూట ఎంతో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు ప్రయాణంతో అలసిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాలికలకు పూర్తిస్థాయిలో హాస్టల్ వసతి కల్పించేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన గోపాల్‌పేట తహసీల్దార్

- నాలా కన్వర్షన్ కోసం లంచం డిమాండ్


పట్టుబడిన తహసీల్దార్ శ్రీనివాసులు

గోపాల్‌పేట: నాలా కన్వర్షన్‌కు లంచం అడిగి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయాడు గోపాల్‌పేట తహసీల్దార్ శ్రీనివాసులు. ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని జింకలబీడుతండాకు చెందిన రైతు ముడావత్ పాండు భార్య రాత్లావత్ సౌందర్య పేరుమీద సర్వే నం.120/యు/2/1/2లో 30 కుంటల భూమి ఉంది. అందులో 15 కుంటల వ్యవసాయ భూమిని కోళ్ల ఫారం నిర్మాణం కోసం జూన్ 20న మీసేవలో రూ.4,200 చలాన్ చెల్లించి స్లాట్ బుక్ చేశాడు. జూన్ 21న పాండు, భార్య సౌందర్య ఇద్దరు సాక్షులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి రాగా.. తహసీల్దార్ శ్రీనివాసులు రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. ఆ తర్వాత మరోసారి కలవగా రూ.8 వేలకు ఒప్పందం కుదిరింది. అనంతరం పాండు జూన్ 26న మహబూబ్‌నగర్‌లోని ఏసీబీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కార్యాలయంలోనే తహసీల్దార్ శ్రీనివాసులుకు రూ.8 వేలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గోపాల్‌పేటలో తహసీల్దార్ శ్రీనివాసులు అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద కూడా సోదాలు జరిపారు. ఈ మేరకు తహసీల్దార్‌ను గురువారం నాంపల్లిలోని ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబరు 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏసీబీ దాడుల్లో సీఐలు అబ్దుల్ ఖాదర్, లింగస్వామి, రామారావు, వెంకట్రావ్‌తోపాటు 10 మంది సిబ్బంది పాల్గొన్నారు.

చెంచుల సంక్షేమానికి చర్యలు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- మొలచింతలపల్లిలో చెంచు ఈశ్వరమ్మ కుటుంబానికి పరామర్శ


ఈశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్: చెంచుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం జిల్లా ఫారెస్టు అధికారి రోహిత్ గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్‌రెడ్డితో కలిసి మొలచింతపల్లికి వెళ్లారు. ఇటీవలనే కొందరు వ్యక్తుల చేతిలో దాడికి గురైన చెంచు ఈశ్వరమ్మను పరామర్శించారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి నివాస గృహాన్ని పరిశీలించారు. ఈశ్వరమ్మకు అందుతున్న వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. వారి భూములకు సంబంధించిన అంశాలపై చర్చించారు. భ్రమరాంబ కాలనీలోని చెంచుల జీవన స్థితిగతుల గురించి స్థానికులతో మాట్లాడారు. కాలనీలోని సమస్యలను అక్కడి చెంచులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈశ్వరమ్మతో పాటు, చెంచుల భూములు ఇతరులు ఆక్రమించుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఫారెస్టు అధికారులకు సూచించారు. వారు వ్యవసాయం చేసుకునేందుకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఈశ్వరమ్మకు రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని కలెక్టర్ చెప్పారు. చెంచులందరికీ ఆధార్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. అర్హులైన చెంచులందరికీ రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. చెంచుల సమస్యలపై తనకు పూర్తిస్థాయి అవగాహన ఉందని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన

మొలచింతలపల్లిలోని జెడ్పీహైస్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల వివరాలు తెలుసుకున్నారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని వంట కార్మికులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. 9వ తరగతిలో వారికి వచ్చిన మార్కుల వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నాగరాజు, ఎస్ఎస్ఏ మానిటరింగ్ అధికారి షర్ఫోద్దీన్, తహసీల్దార్ శ్రీకాంత్ ఉన్నారు.

కొడవలితో దాడి: కేసు నమోదు


గాయపడిన మోహన్

రాజోళి: కొడవలితో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటనపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ జగదీష్ కథనం ప్రకారం.. మాన్‌దొడ్డికి చెందిన తిమ్మప్ప తన భార్యను అనుమానంతో వేధిస్తున్నాడు. రోజూ గొడవ పడటంతో ఆయన కుమార్తె వెంకటేశ్వరి అదే గ్రామంలో ఉంటున్న తమ అన్న ఉప్పరి మోహన్‌కు విషయం తెలియజేసింది. కాగా మంగళవారం ఉప్పరి మోహన్, నజీర్ అనే వ్యక్తితో కలిసి తిమ్మప్ప ఇంటికి వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తీరు మార్చుకోకపోతే పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెడతానని చెప్పి, అక్కడి నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో అక్కడే ఉన్న కొడవలితో తిమ్మప్ప మోహన్‌పై దాడి చేశాడు. ఘటనలో మోహన్ చేతికి తీవ్రగాయమై, రక్తస్రావం జరిగింది. ఈమేరకు అతడి ఫిర్యాదుతో తిమ్మప్పపై బుధవారం కేసునమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

మూడు ఆవులు మృతి



అడ్డాకుల: విద్యుత్ షాక్‌తో మూడు ఆవులు మృతి చెందిన ఘటన మండలంలోని పొన్నకల్‌లో చోటు చేసుకుంది. పాడి రైతు చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన మూడు ఆవులు బుధవారం ఉదయం మేత కోసం ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాయి. పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తగలడంతో అవి అక్కడికక్కడే షాక్‌కు గురై మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.1.50లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు వివరాలను సేకరించారు.

జూనియర్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: మరమ్మతులు చేస్తున్న జూనియర్ లైన్‌మన్ షాక్‌కు గురై తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల చెందిన తిరుపతిరెడ్డి జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొల్లాపూర్ క్రాస్ రోడ్డు జ్ఞాన సరస్వతి దేవాలయ పరిసర ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోతే మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

బదిలీలు, సెలవుల్లో ఉపాధ్యాయులు


మందిపల్లిలో ఉపాధ్యాయులు లేక ఆరుబయట కూర్చొని మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

- 250 మంది విద్యార్థుల చదువు ప్రశ్నార్థకం

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిదుతామని ప్రభుత్వం ఎన్ని మాటలు చెబుతున్నా అవి మాటలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల వలన విద్యార్థులకు శాపంలా మారిందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మందిపల్లిలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠశాల నడుస్తుంది. అందులో దాదాపుగా 250 మందికి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. రెండు రోజులుగా ఉపాధ్యాయులు రావడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు పదోన్నతిపై మరో పాఠశాలకు వెళ్లగా, ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఇలా ఉన్న సమయంలో మరో ఉపాధ్యాయురాలికి సెలవు ఇవ్వరాదని, ఉన్న ఆమె కూడా మరో పాఠశాలకు బదిలీ ప్రయత్నాల కోసం బడికి రాకుండా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే కాంప్లెక్స్ హెచ్ఎం ఇలా సమస్య ఉన్న పాఠశాలకు సీఆర్పీని లేదా పక్క పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాల్సి ఉన్నా, అవేవి పట్టనట్టుగా వ్యవహరించారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

చదువులకు ఆటంకం

విద్యాశాఖ అధికారుల చర్యలతో విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడింది. 250 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకపోవడం విడ్డూరంగా మారింది. ప్రస్తుతం రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే స్థోమత తమకు లేదని, సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు, విద్యార్థులకు అవసరమైన మేర ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు.

రెండు రోజులుగా..



రెండు రోజులుగా పాఠశాలకు ఉపాధ్యాయుల రావడం లేదు. ముఖ్యంగా 8వ తరగతి వరకు తరగతులు నడుస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. మా పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలి.

– ఉషారాణి, 8వ తరగతి, మందిపల్లి

మెనూ పాటించడం లేదు



పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో, తమకు మధ్యాహ్న భోజనం మెనూ పాటించడం లేదు. చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సమస్యపై స్పందించాలి.

– నాగేష్ 8వ తరగతి, మందిపల్లి

సమస్య పరిష్కరిస్తాం..



మందిపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరనే విషయం మాకు గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఈ విషయంపై సంబంధిత కాంప్లెక్స్ హెచ్ఎంకు వివరణ కోరాం. సమస్యను తప్పకుండా పరిష్కరిస్తాం.

– ఎండీ అబ్దుల్ ఘని, జిల్లా విద్యాశాఖ అధికారి, నారాయణపేట

ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం

పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్త సూగూరు హరిజన్‌వాడ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు కొత్తకోటకు బదిలీకావడంతో భవనం మూతపడింది. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా ఇక్కడ ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండడంతో, ఆమె కాస్త బదిలీపై కావడం, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు రిలీవ్ కాకపోవడంతో పాఠశాల మూతపడింది. గ్రామంలో బుధవారం విద్యార్థులు పాఠశాలకు హాజరుకాగా, ఉపాధ్యాయులు లేక తలుపులకు తాళం వేశారు. ఇక్కడికి ఉపాధ్యాయుడు రాకముందే పనిచేసే ఉపాధ్యాయురాలిని ఎలా పంపిస్తారని అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.


కొత్తసూగూరులో తాళం వేసిన పాఠశాల బయట ఆడుకుంటున్న విద్యార్థులు

ఉల్లి ధరలు పైపైకి..

- గరిష్టంగా రూ.3,250, కనిష్టంగా రూ.3,100


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ఉల్లి

దేవరకద్ర: ఉల్లి ధరల ఘాటు వారం వారం పెరుగుతూనే ఉంది. సీజన్ ముగిసి దిగుబడులు తగ్గడంతో ఉల్లి ధర పైపైకి ఎగబాకుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి మే మొదటి వారం వరకు రూ.2 వేలు దాటని ఉల్లి ధర మే నెలలోని చివరి మూడు వారాల్లో రూ.2,400– 2,600 వరకు పలికింది. జూన్ మొదటి వారంలో కూడా అవే ధరలు నమోదవగా.. రెండో వారం నుంచి ఒక్కసారిగా ధరలు పెరిగి.. రూ.3 వేల మార్కు దాటింది. దీంతో గతంలో అమ్ముకోకుండా నిల్వ చేసుకున్న రైతులు ఇప్పుడు లాభాలు పొందుతున్నారు. సీజన్ ముగిసిన తర్వాత ధరలు పెరుగుతాయని భావించిన కొందరు రైతులు నిల్వ చేసుకుని ప్రతివారం కొంత అమ్మకానికి తెస్తున్నారు. ఇక కొందరు వ్యాపారులు కూడా ప్రతి వారం ముందుగానే ఇతర మార్కెట్ల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని దేవరకద్రలో విక్రయిస్తున్నారు. ఇక్కడ ఉల్లికి డిమాండ్ ఉండడంతోపాటు వినియోగదారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేస్తుండడంతో వ్యాపారులు సైతం లాభాలు ఆర్జిస్తున్నారు.

వెయ్యి బస్తాల రాక..

దేవరకద్ర మార్కెట్‌కు బుధవారం వివిధ గ్రామాల నుంచి రైతులు వెయ్యి బస్తాల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. స్థానిక వ్యాపారులతోపాటు బయట నుంచి వచ్చిన వ్యాపారులు, చిరు వ్యాపారులు సైతం వేలంలో పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలంలో ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,250, కనిష్టంగా రూ.3,100 వరకు ధర లభించింది. చిన్నగా ఉన్న ఉల్లి గరిష్టంగా రూ.2,500 వరకు అమ్మారు. మార్కెట్ నిబంధనల ప్రకారం ఉల్లిని ఇక్కడ 45 కిలోల బస్తాలుగా తూకం వేస్తారు. ఉల్లి బస్తా ధర ఎక్కువగా రూ.1,650, తక్కువగా రూ.1,550 వరకు విక్రయించారు. చిన్న ఉల్లి బస్తా ధర రూ.1,250 వరకు అమ్మకాలు సాగించారు. దేవరకద్ర సంతలో ఉల్లి కిలో రూ.40 చొప్పున అమ్ముడుపోయింది.

బాబు భూ దోపిడీ ఖజానా!

అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం అరాచకాలు

- యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూముల దురాక్రమణ
- శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు
- 'రాజధాని లీక్స్'పేరిట బురిడీ
- పక్కా పన్నాగంతో అమరావతి ఎంపిక
- బరితెగించి ఇన్‌సైడర్ ట్రేడింగ్..
- భయపెట్టి భూ మాయాజాలం
- అమరావతి కేంద్రంగా ఎల్లో గ్యాంగ్ రూ.లక్షల కోట్ల కుంభకోణం
- రాజధానిలో భూ బాగోతాలను కప్పిపుచ్చేందుకే శ్వేతపత్రం డ్రామా



సాక్షి, అమరావతి: ''ఏ''అంటే.. అమరావతి అని వక్కాణిస్తున్న సీఎం చంద్రబాబు రాజధాని ముసుగులో తన అవినీతి, అరాచకాలకు కేంద్రంగా చేసుకున్నారు! బరి తెగించి తాను పాల్పడిన అవినీతికి అక్షయ పాత్రలా మార్చారు! నాటి తెల్ల దొరలే తెల్లబోయేలా వ్యవహరించారు! బ్రిటీష్ పాలకుల సామ్రాజ్యవాద దోపిడీని మరిపిస్తూ టీడీపీ పెద్దలు సాగించిన భూ దోపిడీకి నిలువెత్తు సాక్ష్యం అమరావతి... బడుగులు, పేదలకు స్థానం లేకుండా చంద్రబాబు సృష్టించుకున్న నయా జమీందారీ వ్యవస్థకు నిదర్శనం అమరావతి! పచ్చ రాబందులు గుప్పిట పట్టిన రూ.లక్షల కోట్ల విలువైన భూ ఖజానా అమరావతి! దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ దోపిడీకి మౌనసాక్షి అమరావతి!! ఈ భూ బాగోతాలు, తన నిర్వాకాలను కప్పిపుచ్చి మభ్యపెట్టేందుకే తాజాగా అమరావతిపై శ్వేతపత్రం అంటూ మరో డ్రామాకు చంద్రబాబు తెర తీశారు.

మోయలేని భారం మోపుతూ...

రాజధానిగా అమరావతి ఎంపిక చేసిన ప్రాంతం ఇటు విజయవాడ కాదు.. అటు గుంటూరూ కాదు. మూడు పంటలు పండే సారవంతమైన పంట పొలాల్లో నిర్మాణ వ్యయం తడిసి మోపెడవుతుందని చంద్రబాబు అండ్ కో కట్టిన లెక్కలే చెబుతున్నాయి. ఒక్క ఎకరాలో కనీస మౌలిక వసతుల కల్పనకు (బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రూ.2 కోట్లు వ్యయం అవుతుందని, మొత్తం రాజధాని ప్రాంతం అభివృద్ధి చేయడానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చవుతుందని అప్పట్లోనే అంచనా వేశారు. ఏటా ఆ వ్యయం పెరగడమే కానీ తగ్గదు. విభజన అనంతరం రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత భారీగా నిధులు ఖర్చు చేయడం సాధ్యమయ్యే పని కాదని నిపుణులు చేసిన హెచ్చరికలను చంద్రబాబు పట్టించుకోలేదు. తాజాగా భారీగా నిధులు అవసరమంటూనే.. వివరాలు సేకరిస్తామని చెబుతున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన టీడీపీ ప్రభుత్వం.. సంపదను ఎలా సృష్టించి రాజధాని నిర్మాణం చేస్తుందనే ప్రశ్నకు జవాబు లేదు.

భూములు లాక్కుని గాలి మేడలు..!

అమరావతి వేదికగా చంద్రబాబు సాగించిన భూ దందాను అప్పట్లోనే నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనువైనది కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టం చేసింది. ఏడాదికి మూడు పంటలు పండే భూములను నాశనం చేయవద్దని పర్యావరణవేత్తలు అభ్యంతరం చెప్పారు. జీవనాధారమైన తమ భూములను కొల్లగొట్టవద్దని బడుగు, బలహీనవర్గాలు, పేద రైతులు వేడుకున్నారు. వారి విన్నపాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు భారీ భూదోపిడీకి తెరతీశారు. అసైన్డ్ భూములను బినామీల ద్వారా హస్తగతం చేసుకుని పరిహారం ప్రకటించుకున్నారు. 2014–19 మధ్య రాజధాని పేరిట అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం చేయని దురాగతం లేదు. అదిగో రాజధాని.. అల్లదిగో అమరావతి..! అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. అంతకుముందు పక్కా పన్నాగంతో రాజధాని అక్కడ.. ఇక్కడ అంటూ పలు ప్రాంతాల పేర్లను తెరపైకి తెచ్చి సామాన్యులను బురిడీ కొట్టించారు. మరోవైపు ముందస్తుగా తాము భూముల కొనుగోలు చేసిన అమరావతిలో బినామీ మాఫియాను వ్యవస్థీకృతం చేశారు. అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు కట్టి రైతుల కాళ్ల కిందున్న భూమిని కాజేశారు.

పచ్చ దండు దురాక్రమణ..

దేశంలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీకి చంద్రబాబు బరి తెగించారు. రాజధాని ప్రచారంతో మాయాజాలం... భూసమీకరణ ముసుగులో దోపిడీ... అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, లంక భూముల స్వాహా... ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి మలుపులు... అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు... ఇలా ఒకటేమిటి ఎన్ని రకాలుగా భూదోపిడీకి పాల్పడవచ్చో అన్ని విద్యలూ ప్రయోగించారు. అమరావతిపై చంద్రబాబు 'పచ్చ దండు'దండయాత్ర చేసి రూ.లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణకు పాల్పడింది. చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై వాలిపోయారు. చంద్రబాబు, లోకేశ్‌తోపాటు నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగుంట మురళీమోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామకృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్పీ రామారావు.. ఇలా పచ్చ దండు అంతా అమరావతిలో భూములను కొల్లగొట్టింది. అన్యాయంగా, ఏకపక్షంగా విభజనకు గురై కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఆదిలోనే హంసపాదులా అభివృద్ధికి గండి కొట్టారు. తాత్కాలిక రాజధాని భవనాల పేరుతో కనికట్టు చేశారు.

మభ్యపుచ్చే యత్నాలు..

నాడు ఐదేళ్లలో భూముల దోపిడీకి పాల్పడటం మినహా టీడీపీ పెద్దలు రాజధాని కట్టిందీ లేదు.. అభివృద్ధి చేసిందీ లేదు. చంద్రబాబు బృందం సాగించిన భూ దోపిడీ ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతోసహా బట్టబయలైంది. సీఐడీ న్యాయస్థానాల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేసింది. ఇక న్యాయ విచారణ ప్రక్రియ కొనసాగితే చంద్రబాబుకు యావజ్జీవ ఖైదు ఖాయమని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సరికొత్త కుట్రలకు పన్నాగం పన్నుతున్నారు. అమరావతిలో తన భూ బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు శ్వేతపత్రం పేరుతో డ్రామాకు తెర తీశారు. రాజధాని నిర్మాణానికి తాను ఏం చేస్తానో చెప్పకుండా ఊకదంపుడు ఉపన్యాసంతో ఊదరగొట్టారు. రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కానీ అమరావతి పేరిట చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన దోపిడీ దాచేస్తే దాగేది కాదు. ఇప్పటికే పూర్తి ఆధారాలతో సహా చార్జిషీట్ల రూపంలో నిక్షిప్తమైందన్నది నిఖార్సైన నిజం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

శ్రీవారి సేవలో భారత మహిళా క్రికెటర్లు

తిరుమల: తిరుమల శ్రీవారిని మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీతి కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



తిరుమల ఆలయం వెలుపల భారత మహిళా క్రికెటర్లు

జస్టిస్ శరత్, రేవంత్‌ల ఫోన్లు ట్యాపింగ్

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీ చేసింది. తాజాగా ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం మధ్యాహ్న విరామం తర్వాత విచారణ చేపట్టింది.

విచారణ 23వ తేదీకి వాయిదా..

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేశామని ధర్మాసనానికి వివరించారు. కేసు ఎప్పుడు నమోదు చేశారు? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ అయ్యాయి? నిందితులెవరు? కేసు పురోగతి ఎంత వరకు వచ్చింది వంటి వివరాలు అందులో పేర్కొన్నామని.. కానీ ఇంకా రికార్డు కాలేదని చెప్పారు. ఈ వివరాలను రికార్డు చేయాలని కోర్టు అధికారులను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను కూడా బాధితుడినేనని, పోలీసు అధికారుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నానని.. తనను ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ చేయాలంటూ సిద్దిపేట జిల్లాకు చెందిన హయతుద్దీన్ వేసిన పిటిషన్‌పై నిర్ణయాన్ని కూడా ధర్మాసనం వాయిదా వేసింది.

ప్రభుత్వం అఫిడవిట్లో పేర్కొన్న వివరాలివీ..

''నాయిని భుజంగరావు (ఏ3) వాంగ్మూలం మేరకు.. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు, జస్టిస్ కాజా శరత్, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదిస్తున్న న్యాయవాదులు, పార్టీ నేతల వ్యక్తిగత జీవితం, చేసే పనులు తెలుసుకుని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా ప్రభావితం చేశారు. బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి వచ్చినప్పుడల్లా అవతలి వారి ఫోన్లు ట్యాప్ చేసి బెదిరించేవాళ్లు. హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలకు ఎర కేసులో, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ అంశం సమయంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. 'నేను కీలక వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించి ప్రణీత్‌కుమార్‌కు అందజేసేవాడిని. వారి ఫొటోలు, అడ్రస్‌లు సేకరించి చర్యలు తీసుకోవడం కోసం ఇంటెలిజెన్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు పంపేవాళ్లం' అని భుజంగరావు చెప్పారు. టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి వివరాలు సేకరించినట్టు, ఫోన్ నంబర్ చెబితే వారి కాల్‌లకు సంబంధించి వివరాలు కూడా సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చినట్టు తెలిసింది. జస్టిస్ కాజా శరత్, ఆయన సతీమణి మాధవి నంబర్లు, కాల్‌ల వివరాలు, అడ్రస్‌లు జియో ఆఫీస్ నుంచి తెలుసుకున్నారు.

కీలక వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్..

సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డి, విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఈటల నితిన్, శివధర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి, రోనాల్డ్ రోస్, ధర్మపురి అర్వింద్, ఎం.రమేశ్‌రెడ్డి, మేఘా శ్రీనివాస్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్, పీడీ కృష్ణకిశోర్, ఐఏఎస్ దివ్య, తాటినేటి శశాంక్, రాజ్‌న్యూస్ సునీల్‌రెడ్డి, చిలుకా రాజేందర్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, నరేంద్రనాథ్ చౌదరి, తీన్మార్ మల్లన్న (నవీన్), ఏఎంఆర్ ఇన్‌ఫ్రా మహేశ్‌రెడ్డి, వీరమళ్ల సత్యం, గాలి అనిల్‌కుమార్, రామసాయం సురేందర్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేరెడ్డి స్వప్నిక, కాసాని జ్ఞానేశ్వర్, కొల్లే సరిత, అంజన్న (ఈటల గన్‌మన్), అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మనాల మోహన్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు మరికొందరి ఫోన్లను ట్యాప్ చేశారు.

మధ్యవర్తిగా టీవీ 5 సాంబశివరావు..

సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, టీవీ 5 సాంబశివరావులకు సంబంధించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వివాదం ఉంది. ఈ పంచాయతీని సాంబశివరావు భుజంగరావు వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావుపై చాలా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వాటి నుంచి బయటపడాలంటే రూ.15 కోట్లు బీఆర్‌ఎస్‌కు పార్టీ ఫండ్‌గా ఇవ్వాలని భుజంగరావు ఒత్తిడి తెచ్చారు. శ్రీధర్‌రావు రూ.13 కోట్లు విలువైన బీఆర్‌ఎస్ బాండ్లు కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం వహించిన సాంబశివరావు రూ.2 కోట్లు తీసుకున్నారని భుజంగరావు వాంగ్మూలంలో పేర్కొన్నారు..'' అని ప్రభుత్వం అఫిడవిట్‌లో తెలిపింది. వీటితోపాటు మరిన్ని వివరాలనూ వెల్లడించింది.

మహిళా అభ్యున్నతి కోసం కృషి



మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని మహిళల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషిచేస్తానని బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షురాలు బాదం సుజాత అన్నారు. చైతన్య వేదిక నూతన జిల్లా అధ్యక్షురాలిగా సుజాతను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు హరినాథ్ బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇక ముందు జిల్లాలో మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరిగినా సహించబోమని, మహిళల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామన్నారు. మహిళల పట్ల చిన్నచూపు చూడటం తగదని, అలాంటి వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమాజంలో సగభాగమైన మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చైతన్య వేదిక అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేస్తానని, మహిళలను చైతన్యపరచడమే విధిగా ముందుకెళ్తానన్నారు. తనను చైతన్య వేదిక అధ్యక్షురాలిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు హరినాథ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

జడ్చర్ల టౌన్: మండలంలోని నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బదిలీల కోసం స్పాజ్ జాబితాలో వెబ్ ఆప్షన్లు ఇచ్చే క్రమంలో తప్పుగా ఇచ్చినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు బుధవారం నోటీసులు ఇచ్చినట్లు ఎంఈఓ మంజులాదేవి తెలిపారు. నోటీసు అందుకున్న వారిలో విజయలక్ష్మి (పీఎస్ వల్లూరు), శివలీల (పీఎస్ ఆలూరు), జ్యోతి (పీఎస్ మాచారం), శారద (పీఎస్ కావేరమ్మపేట) ఉన్నారు. వీరి భర్తలు ఇదే మండలంలో పనిచేస్తుండగా వారు పనిచేస్తున్న పాఠశాలకు 10కి.మీ. దూరంలోనే బదిలీ కోసం వెబ్‌లో నమోదు చేసుకోవాల్సి ఉండగా పరిధి దాటి చేసుకున్నారని ఆరోపణల నేపథ్యంలో నోటీసులు జారీఅయ్యాయి.

పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో హైడ్రామా

- హాజరైన చిన్నారెడ్డి, స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు
- శిలాఫలకాన్ని తొలగించేందుకు వచ్చిన తహసీల్దార్
- పట్టుబట్టి ప్రారంభించిన ఎంపీపీ, జెడ్పీటీసీ
- తీవ్ర విమర్శలు గుప్పించిన చిన్నారెడ్డి



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



పీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్

ఖిల్లాఘనపురం: మండలంలోని కర్నెతండాలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన ప్రారంభోత్సవంలో బుధవారం హైడ్రామా చోటు చేసుకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించేందుకు అప్రూవల్ రాలేదని కలెక్టర్ ఆదేశించారని తహసీల్దార్ పాండునాయక్ భవనానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలిగించేందుకు అక్కడికి రాగా గిరిజనులు అడ్డుకున్నారు. ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్‌లతో కలిసి ప్రారంభించేందుకు అక్కడికి వచ్చిన చిన్నారెడ్డి చేసేది లేక ఆస్పత్రి ఎదుట టెంకాయ కొట్టగా ఎంపీపీ, జెడ్పీటీసీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నారెడ్డి మాట్లాడారు. కొందరు అద్దె నాయకులు వచ్చారని, వారు మరో కొత్త ఇల్లు మంచిగా కనిపిస్తే అక్కడికి వెళ్లి పోతారని విమర్శించారు. అభివృద్ధి అంటే తెలియని నాయకులు ఇలాంటి తప్పుడు కార్యక్రమాలకు పూనుకుంటారని చెప్పారు. ఎంతో కష్టపడి ఏడు గిరిజన తండాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని ఒక అడవి బిడ్డగా, గిరిజనుడిగా ఎంతో కష్టపడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించుకుని, నిర్మాణం చేయించిన ఎంపీపీ కృష్ణానాయక్ పేరు లేకుండా చేయాలనుకోవడం ఒక దుర్మార్గమైన చర్య అని అన్నారు. తన పదవీకాలం ముగుస్తుందని, పీహెచ్‌సీని ప్రారంభించేందుకు సమయం ఇవ్వమని గౌరవంగా ఎంపీపీ ఆహ్వానించినప్పుడు వచ్చి కార్యక్రమంలో పాలుపంచుకుంటే ఎంతో గౌరవం ఉండేదన్నారు. 9 పంచాయతీ భవనాలు, ఇటీవల సూగూరులో బ్రిడ్జిని క్యాబినెట్ హోదాలో ఉన్నా తనకు తెలియకుండా ప్రారంభించినప్పుడు అధికారులకు, ఇప్పుడు అడ్డుకోవాలనుకుంటున్న నాయకులకు గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. తనను పక్క పెట్టి ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డిని ఎందుకు గెలిపించలేకపోయారని ఎద్దేవ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి ఇలాంటి అద్దె నాయకుల నుంచి పార్టీని రక్షించుకోవాలన్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు..

కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశానుసారమే కర్నెతండాలో బుధవారం ప్రారంభిస్తున్న పీహెచ్‌సీ శిలాఫలకాన్ని తొలిగించేందుకు వెళ్లామని తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. టీజీఎంఎస్ఐడీసీ ఈఈ నుంచి సంబంధిత భవనం పనులు పూర్తికాలేదని పంపిన లేఖను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ఇచ్చామన్నారు.

కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, విజయ్‌కుమార్, పీనానాయక్, శాంతి, మన్యంగౌడ్, రాళ్ల కృష్ణయ్య, నాగయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు విరమణ ఉండదు

ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేయాలనుకునే వారికి పదవీవిరమణ ఉండదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల పరిషత్ కార్యాలయ ఆధ్వర్యంలో పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన ప్రజా ప్రతినిధులతో పాటుగా ఇటీవల డీఈగా పదోన్నతి పొందిన పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్ నాయక్‌ను వారు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ పాండునాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, పీఆర్ డీఈలు ప్రమోద్‌రావు, కబీర్‌దాస్, ఎంఈఓ ఉషారాణి, ఏఓ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

- కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం





ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బాల, బాలికలు హాజరయ్యారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచిన వారు గురువారం నుంచి జరిగే మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. సింగిల్స్‌లో బాలురు 8 మంది, బాలికలు నలుగురు, డబుల్స్‌లో బాలురు నలుగురు అర్హత పొందారు. మొదటిసారిగా ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాల, బాలికలతో స్టేడియం కిటకిటలాడింది. కాగా మెయిన్‌డ్రా పోటీలు గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు బుధవారం పరిశీలించారు. ఈనెల 6న ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షుడు విజయ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగ కొనసాగుతుంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా 78 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బుధవారం నాటికి 1,019 అడుగులకు నీటిమట్టం చేరింది. లిఫ్టుల ద్వారా 55, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

బహుజన వీరుడు పండుగ సాయన్న

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బహుజన వీరుడు పండుగ సాయన్న అని, ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన వీరుడు పండుగ సాయన్న భూస్వాములకు, ధనవంతులకు వ్యతిరేకంగా పేదల పక్షన పోరాటంచేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని తెలిపారు. పండుగ వాతావరణంలో విగ్రహ ఆవిష్కరణ నిర్వహించాలన్నారు. కృష్ణముదిరాజ్ మాట్లాడుతూ సాయన్న అన్ని వర్గాల్లో ఉన్న పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో ఈనెల 17న పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మైత్రియాదయ్య, విజయ్‌కుమార్, ప్రభాకర్, ఆశన్న, వెంకటేష్, రాకేష్, ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఆశ్రమ పాఠశాలల్లో అటకెక్కుతున్న చదువులు

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్



మాట్లాడుతున్న నాయకులు

లింగాల: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు చదువులు అటకెక్కుతున్నాయని.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ అన్నారు. మండల పరిధిలోని క్యాంపురాయవరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడ 100 మంది వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారని అన్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా విద్యా బోధన నత్తనడకన కొనసాగుతుందని ఆరోపించారు. నేటి వరకు నోట్ పుస్తకాలు పంపిణీ కాలేదని విచారం వ్యక్తం చేశారు. వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు. ఆశ్రమ పాఠశాలల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని ఆరోపించారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కోసం త్వరలో ఆందోళన కార్యక్రమంలో చేపట్టబోతున్నట్లు వివరించారు. జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పట్టు జారితే.. ప్రమాదమే..!



ఇలాంటి చిత్రాలు నారాయణపేట ప్రాంతంలో నిత్య కృత్యాలు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వచ్చి వెళ్తుంటారు. అందుకు తగిన బస్సులను ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారు. సమయానికి సరిపడ బస్సులు అందుబాటులో లేవు. ఇక బస్సులో స్థలం లేని వారు ఇలా ఆటోలకు వేలాడుతూ ప్రమాదకరంగా వచ్చి వెళ్తుంటారు. పట్టు జారితే మాత్రం ప్రమాదాల బారిన పడక తప్పదని తెలిసిన చదువుల కోసం ఈ సర్కస్ ఫీట్లు తప్పడంలేదని విద్యార్థులు వాపోతున్నారు.

– నారాయణపేట రూరల్